*ఇంటి బాడుగ చవుక అనుకున్నారుగానీ, ఇంటివాళ్ళ ఎత్తు ఖరీదైనదని కొంత కథ నడిచిన తర్వాత తెలుస్తుంది. అంతటితో బుచ్చిబాబు- బుల్లి మరదలు కథ కంచికి కాదుకానీ యింకో యింటికి చేరుతుంది.*

# బుచ్చిబాబూ- బుల్లిమరదలూ-

శ. మాధవీలత



ఆదివారంనాడు పత్రికలో 'అద్దెకు' అనే కాలంలో ఓ యిల్లు చూసి ఎగిరిగంతేసినంత పని చేసింది బుల్లెమ్మ. హూటాహూటిగా ప్రయాణమయ్యారు బుల్లెమ్మ. బుచ్చిబావాను.

నాలుగ్గదులు, ముందో పెద్ద పంచా, గాలీ వెల్తురూగల యిల్లు. పెద్ద దొడ్డి నిండా పూల చెట్లు, అద్దె చూడబోతే కారుచవక యాభై రూపాయలే. ఆ యింటిని చూడగానే ప్రాణం లేచొచ్చింది. నచ్చింది ఒప్పేసుకుందాం అని కళ్ళతోనే మాట్లాడుకున్నారా దంపతులు.

వెంటనే రెండు నెల్ల అడ్వాన్సు కింద ఓ వంద రూపాయలనోటు అందించాడు యింటి యజమాని శేషయ్యర్‌గారికి.

"ఎప్పుడొచ్చి జేర్తారు బాబూ," అంది యింటి సొంతగలామె మీనాక్షమ్మ.

"ఇంకో గంటలో వచ్చేస్తాం పిన్నిగారూ!" అని పరస కలిపింది బుల్లెమ్మ.

"అట్లాగేమ్మా! మీరొచ్చేసరికి యిల్లు సుబ్బరంగా కడిగి ముగ్గులు పెట్టి వుంచుతా."

"కొత్త ఊరు మాకేం తెలీదు" అన్నాడు బుచ్చిబాబు.


"డోంట్‌వర్రీ! డోంట్‌వర్రీ. మీకేం భయంలేదు మేం వున్నాం" అన్నాడు యింటాయన శేషయ్యర్.

"బావా! యింత పెద్ద మద్రాసు మహానగరంలో అన్ని వసతులతో తక్కువ అద్దెతో యిల్లు దొరకడం ఎంత అదృష్టం కదూ బుచ్చిబావా!" "అదృష్టమని మెల్లిగా అంటావేం. అసలు యిల్లంటూ దొరికి మన బ్రహ్మచర్యం తప్పింది." "అవున్లే నేనొచ్చి రంగంలోకి దిగకపోతే నీ బ్రహ్మచర్యమింత త్వరగా తప్పేదనుకున్నావా?" అంది చూపుల్లోనూ, మాటల్లోనూ గర్వం పుట్టిపరుస్తూ.

"అవును బుల్లీ! నువ్వుపక్కన లేకపోతే ఏ పనీ చెయ్యలేను సుమా! అదీకాక నీదసలు అదృష్ట జాతకం లెద్దూ! దేనికి కాళ్ళరిగిపోయేట్టు తిరగక్కర్లేదు."

"అహా!" అని ఓ తళుకు చూపు విసిరింది. ఆ మాటా ఈ మాట చెప్పుకుంటూ లాడ్జికి చేరేరు. తమ కొత్త కాపరానికేం కావాలో ఆ సామాన్లన్నీ ఓ లిస్ట్ రాసింది బుల్లెమ్మ. బేంక్‌కెళ్ళి ఓ వెయ్యి రూపాయలు డ్రా చేసుకుని మూడు గంటల్లో కాపరానికి కావల్సిన అతి ముఖ్యమైన సామాన్లు కొని టెంపోలో వేసుకుని కొత్తింట్లో పడేసి హమ్మయ్య అనుకున్నారు.

"అబ్బ యిప్పటికి నా కాపరం ఏర్ప




డింది- యింక నాకేం దిగులు లేదు" అంటూ భర్త వళ్ళో వాలిపోయింది.

"అవును బుల్లీ! ఈ మూడు నెలలూ మూడు యుగాలుగా గడిపాననుకో-ఏమాట కామాటే చెప్పాలి. నువ్వు ధైర్యం చేసి వచ్చావు కాబట్టి నీ అదృష్టం. వెంటనే యిల్లు దొరికింది. లేకపోతే నీ జ్ఞాపకాలతోనే పిచ్చాడినైపోయి...."

"నీ సంగతి నాకు తెలీదా బుచ్చిబావా! నా జ్ఞాపకాల్తో నువ్వెక్కడ ఉద్యోగానికి తిలోదకాలొదుల్తావోనని భయపడ్డా-అందుకే పరుగెత్తుకొచ్చా!"

అంతవరకూ దొండపండ్లలాంటి భార్య పెదాలను తన మొరటు వేళ్ళతో నలిపేస్తున్నవాడల్లా హఠాత్తుగా బిగుసుకుపోయినట్టు "అయితే! ఆయితే! నువ్వు నాకోసం రాలేదన్నమాట! నే వుద్యోగమెక్కడ మానేస్తానోనని వచ్చావన్నమాట!" అన్నాడు బాధతో.

"ఫో! నువ్వొట్టి పిచ్చివాడివి బావా! ఆడదాన్ని అల్లా బైటపడ్డం నాగరీకం కాదని గానీ, బుచ్చిబావా! విరహంతో ఎట్లాయిపైపోయానో నీకేం తెల్సు. అందుకే ఎవరెన్ని చెప్పినా వినక, యిల్లు లేకపోతే లాడ్జిలోనన్నా వుంటానని నీ పొందుకోసం పరితపించి పరిగెత్తుకొచ్చా బావా!" అంది చెవులో ఆఖరి మాటలు మంద్రస్వరంతో.

"అవునా బుల్లీ!" అంటూ ఆమెని తన బాహు బంధాల్లో బంధించేశాడు.

అప్పనంటూ తలూపి యిల్లు దొరికిందని వూరికి ఉత్తరం రాయాలంది

"అవును బుల్లీ! వెంటనేరాయి. మద్రాసులో యింత పెద్ద యిల్లు యాభై రూపాయలకి దొరికిందంటే మన ప్రజ్ఞకీ, అదృష్టానికీ మురిసిపోతారు."

"నీ ప్రజ్ఞేం కాదు అంతా నాదే" అంది చిన్నపిల్లలా గారం పోతూ.

"యగ్రీడ్ బుల్లీ! యగ్రీడ్. మరి కడుపులో ఆత్మారాముడు గంతులేస్తున్నాడు లే హోటల్ కెళ్ళాం" అన్నాడు.

"అబ్బ అంత దూరం నే నడవలేను బాబూ!"

"ఈ ఒక్క రోజేగా రేపటినుంచి తమ రెక్కడికీ కదలక్కర్లే."

"ఏమిటీ రేపటినుంచి నేనెక్కడికీ కదలక్కర్లేదా? అన్యాయం. నన్ను నాలుగ్గోడల మధ్య బందీని చేస్తావా?" అంది ఏడుపు ముఖంతో.

"అది కాదు బుల్లీ!"

"నువ్వేం మాట్లాడక. స్కూటర్ కొనుక్కునేందుకు వెంటనే డబ్బు పంపమని అత్తయ్యకి రాసేస్తా-అయినా నువ్వు రోజూ యింత దూరం నడవడం నే సహించలేను బావా!"

"ఈ నడక నాకో లెఖ్ఖా. ఓ ఫర్లాంగ్ కాలాడిస్తే బస్టాప్, దట్సాల్," అన్నాడు కాలర్ పైకెత్తుకుంటూ.

"ఏం బస్సో పాడు, వచ్చేదాకా పడిగాపులు-తీరా వస్తే కన్ను మూసీ తెరిచేంతలో వుడాయించడం. అంతకీ ఎలాగో తోసుకుంటూ తొక్కుకుంటూ ఎక్కి ఒంటికాలి భరతనాట్యం ఎవరు చేస్తారు బావా. చక్కగా స్కూటర్ మీద యిద్దరం సాయంత్రం పూట అల్లా - అల్లా షికార్ తిరిగి ఎంజాయ్ చెయ్యక బస్సుట బస్సు."

"అయ్యో అయ్యో ఏం ఆశ బుల్లెమ్మగారికి. ఆ స్కూటర్ నే రయ్యిన తోలుతుంటే, నువ్వు భయంతో నన్ను అమాంతం వాటేసుకుంటే నేను చక్కిలిగింతలతో యిదైపోతూ, బాబోయ్ ఎవరినన్నా గుద్దేస్తే - వద్దు బుల్లీ స్కూటరొద్దు" అన్నాడు గడ్డం పట్టుకు ప్రాధేయపడుతున్నట్టు.

"ఇదుగో బుచ్చిబావా! ఈ పప్పులేం నాదగ్గర వుడకవు. స్కూటర్ కొనితీరాల్సిందే. చూడు నా జాతకంలో వాహనయోగంవుంది. అది తల్లకిందులు చేసేందుకు నీ తరమేం కాదు."

"బుల్లీ! బుల్లీ! అసలు సంగతి చెప్పనా. మరీ! మరీ! అంతంత పెద్ద బస్సులూ, కార్లూ వెళ్ళయని పోతుంటే వాటిమధ్య పిట్టల్లా మనం స్కూటర్లో వెళ్ళాలంటే

## బంపర్ దీపావళి ఆఫర్

ఆగస్టు 1978 బహుమతులు గెలిచినవారు : హరియప కుమార్ సాహ భగాల్పూర్ మరియు తారాచంద్ జంజీర్ శికార్ (రాజ్) ఎంట్రీ ఫీజు లేదు

బహుమతులు : వాచ్. కెమెరా. టేప్‌రికార్డర్. రికార్డ్ ప్లేయర్ ప్రెషర్‌కుక్కర్ (మా అభీష్టంపై ఏదో ఒక బహుమతి.) కన్సొలేషన్ లేక మూడవ బహుమతి : సోని సూపర్ డీలక్స్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టర్ అమ్మకం ధర 135/-. ఇది అమ్మకం అభివృద్ధి పథకం.

| | | |
|---|---|---|
| 9 | 14 | 7 |
| 8 | 10 | 12 |
| 13 | 6 | 11 |

నిబంధనలు : 1. తెల్ల కాగితంపై నమూనాలో ఇవ్వబడిన విధంగా గళ్ళు గీసి 7 నుండి 15 వరకుగల అంకెలను ఒకసారి మాత్రమే వాడి ఎటు కూడినా మొత్తం 33 రావలయును. 2. బహుమతి గెలిచినవారు పోస్టేజి, ప్యాకింగ్ మొదలగు ఫీజులు చెల్లించుటకు తెలియపర్చబడును. వివాదములు ఆలీఘర్ జ్యూరిస్ డిక్షన్‌లో మాత్రమే. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో మాత్రమే పంపండి.

ఆఖరి పోస్టింగ్ తేదీ : 24-10-78

MAYUR TRADERS (AJSV-33) ALIGARH-30

నాకు భయం. కళ్ళు తిరుగుతై బుల్లీ!" అన్నాడు. భయం ఆ కళ్ళలో గూడుకట్టుకున్నట్టుంది.

"ఇదో బుచ్చిబావా! నీ పక్కన నేనున్నంత వరకూ నీకేం భయంలేదు. ఆ మోజు కొన్ని రోజులు తీర్చుకుందాం, ఆ తర్వాత ఓ కారుకొంటే పోయే. మనమేం లేనివాళ్ళమా? ఏదో వుద్యోగం పురుష లక్షణమని ఈ వుద్యోగమేగానీ లేకపోతే ఎందుకు."

"అవునవును. వున్నవూళ్లో కన్నవారి ఎదుట కాలుమీద కాలేసుక్కూచుని తినాల్సిన ఘటం. ఏదో నీ మాటలు విని ఇట్లా పరాయి వూళ్ళో...."

"పరాయి ఊళ్ళో ఆకులు మేస్తున్నామంటావ్? ఆ మాట అండానికి నీకు ఇది వుండొంట యిది?" అంది ఛీత్కారంగా.

"ఏమిటా యిదీ?" అన్నాడు జేల ముఖమేసి.

"ఎందుకులే నా నోటితోనే నిన్నంత మాటలనడం పాపం."

"ఫర్వాలేదులే చెప్పు బుల్లీ!"

"చెప్పనా మరేం అనుకోవుగా. పోన్లే పాపం చెప్పేస్తా. మరీ మరీ అడుగుతున్నావని నే చెప్తున్నా- కాబట్టి పతి దేవుళ్ళను అనరాని మాట అన్నందుకు నాకేం పాపం రాదులే."

"అయితే అంత పాపం చుట్టుకునే మాటా? అయితే చెప్పకు బుల్లీ చెప్పకు."

"ఫర్వాలేదులే బావా! అబ్బ మా బావకి పెళ్ళామంటే ఎంత యిదో" అంది అతని బుగ్గ ముద్దెట్టుకుంటూ.

"ఎప్పుడూ యిదీ యిదీ అంటావేగానీ ఆ యిదేమిటో చెప్పనంటావ్. ఈ కొద్ది సేపట్లో నాకు తెలీని నువ్వనే రెండో యిది యిది."

"చెప్తా విను బావా! మొదటి యిది నీకు సిగ్గులేదా అని...."

"ఆహా - ఏమిటీ అయితే నన్ను సిగ్గుమాలినవాడంటావ్!"

అవునన్నట్టు తలూపింది.

"బుల్లీ నిన్నూ! నిన్నూ!" అన్నాడు కుడి పిడికిలి బిగించి ఎడం చేతిలో గుద్దుకుంటూ.

"రెండో యిదికూడా చెప్పనీ బావా! అంతలోకే కోపమొస్తే ఎట్లా? రెండో యిదంటే నామీదెంత ప్రేమో అని" అంది సుతారంగా క్రాఫ్ సర్దుతూ.

"బుల్లీ! నువ్వంటే నాకెంతో ప్రేమ". అంటూ ముద్దులతో ముంచెత్తాడు.

అతని చేతుల్లోంచి సుతారంగా తప్పించుకుని "బావా! ఆకలి" అంది. చిన్నపిల్లలా.

మూణ్ణిముషాల్లో ముస్తాబై తలుపుకి తాళంపెట్టి టింగురంగామని బైల్దేరారు.

"ఇంత ఎండలో ఎక్కడికి పూడుస్తున్నారు?" అన్నాడు యింటి గలాయన కామన్ పంచలో పాత కుర్చీలో పడుకున్న వాడల్లా లేచి ఆపేక్ష వుట్టిపడుతున్నట్టు. నాలుగు రోజులు మద్రాస్‌లో వుండగానే వెళ్ళడం అనే పదానికి అరవంలో పర్యాయపదం పూడ్చమని తెల్సుకున్న బుల్లెమ్మ.

"భోంచేసొద్దామని బాబయ్యగారూ" అంది.

"వ్హాట్? వ్హాట్. యిప్పుడు భోజనమా? పెద్దదిక్కు లేకపోతే యిదే కష్టం. ఓ కామాక్షీ" అని పెళ్ళాని పిల్చేడు.

"పిల్చారా?" అంటూ వచ్చింది.

"చూడు పాపం పసివాండ్లుం. కొత్త కాంపురం. నాలుగూ సర్దుకునేదాకా మనింట్లోనే వీండ్లకి విస్తరివెయ్యి. అండర్ స్టేండ్?" అన్నాడు.

"మీరు చెప్పాలిటండీ నా కామాత్రం తెలీదు. బుల్లెమ్మని చూసినప్పుడల్లా మన చిట్టే జ్ఞాపక మొస్తుంది. అదీ నీలాగే దూరాభారాన కాపురం చేస్తోందమ్మా."

"వూపో. యింకా మాట్లాడుతూనే వున్నావ్ టయం ఎంతో తెల్సా?"

"ఇదో ఒక్క నిముషం."

"అబ్బే యిప్పుడెందుకండీ మీకు శ్రమ పిన్నిగారూ."

"శ్రమా లేదు గిమా లేదు భలేదానివే. నే నివాళ నీ కాదుకుంటే రేపు నా బిడ్డకి యింకో అమ్మ ఆదుకుంటుంది. యింతలో మన కండలేం కరిగిపోవు" అంటూ బుల్లెమ్మని లోపలికి తీసుకెళ్ళింది.

బియ్యం కడిగి ప్రషర్‌కుక్కర్‌లో పడేసింది.

"ప్రషర్ కుక్కరుందా పిన్నిగారూ?" అంది ఆశ్చర్యంగా.

"నేకొనలేదే బుల్లెమ్మా. ముందు కాపురమున్న అమ్మాయికేదో చేదోడు వాదోడుగా వుంటే. తన జ్ఞాపకార్థం కొనిచ్చింది. ఆ అమ్మాయి పుణ్యమా అని నాకష్టం తీరింది. మీవార్ని కాళ్ళు కడుక్కోమను వడ్డిస్తా."

వారం రోజులనుంచి హోటల్లో చప్పిడి మెతుకులు తిన్న బుల్లెమ్మ జిహ్వాకి పిన్నిగారి వంట రుచిగా వుండటంతో తృప్తిగా తిని ఒక్క కునుకుతీసి బైటకెళ్ళే ప్రయత్నంలో వున్న బుల్లెమ్మకి పిన్నిగారి గొంతు వినపడి బైటకొచ్చింది.

"ఇదుగోమ్మా! కాఫీ. ఈ వేడినీళ్ళకంత దూరం వెళ్ళాలా మేంలేం. మరీ అంత ముఖమాటపడ్తే ఎట్లా అంటూ రెండు గ్లాసుల్లో చిక్కటి కాఫీ, సగ్గుబియ్యం వడియాలూ యిచ్చింది.


ప్రా తేదీ- 15-10-78

స్వామి అయ్యప్ప

SWAMY AYYAPPA GROUP

A.P.S.F

గ్రూప్‌లో

సభ్యులుగా చేరండి!

ఉచితంగా!

టాయిలెట్ జిప్ బ్యాగ్ పొందండి!

ANDHRA PRADESH SAVING & FINANCE RAJAHMUNDRY-533101

ఆంధ్రప్రదేశ్ సేవింగ్ & ఫైనాన్స్

ఫోను: 4411

గ్రామ్స్: సేవింగ

రాజమండ్రి-533101

బ్రాంచి : టి. వి. రాఘవయ్య పార్కు ఎదుట, బందరు రోడ్డు, విజయవాడ-2

రీజనల్ ఆఫీసు : నాంపల్లి స్టేషన్ రోడ్, 5-8-107, హైదరాబాద్

బ్రాంచీలు : కర్నూలు, ఆదోని, అనంతపూర్, కడప, రాజింపేట, ఏలూరు, నూజివీడు, కొయ్యలగూడెం, మండపం, నల్గొండ, ఖమ్మం, కొత్తగూడెం, బూర్గంపాడు

"బుల్లీ! నాకు అరవం వచ్చేడవదూ! ఏకొట్లో సామాను బాగుంటుందో కూడా తెలీదు. ఎట్లాగబ్బా" అన్నాడు వెచ్చాల చీటీ అందుకుంటూ.

"అదీ పాయింటే బావోయ్! వుండు పిన్నిగార్ని అడిగొస్తా." ఇంట్లో బుచ్చిబావా అని పిల్చినా బైట కెళ్తే మొగుణ్ణి ఏమండోయ్ అని పిల్చే సుగుణం కల బుల్లెమ్మ.

"ఏమండోయ్!" అని కేక పెట్టింది పక్క పోర్షన్‌లోంచి.

"ఆ లిస్ట్ యిట్లా యివ్వు బాబూ! నే తెచ్చిపెట్తా. ఆఫ్ట్రాల్ దీని కోసం నువ్వు హయిరాను పడ్డం నాట్ గుడ్. నువ్వేం వర్రీ అవక సాయంత్రం నువ్వు వచ్చేసరికి ఆల్ రెడీ. బుల్లెమ్మా మాతో పాటే తింటుంది. డోంట్ వర్రీ నువ్వెళ్ళిరా" అన్నాడు యింటాయన.

విచ్చిన ముఖారవిందంతో రెండు వంద రూపాయల నోట్లూ, లిస్టూ ఆయన చేతిలో పెట్టూ "థేంక్స్" అంటూ వుడాయించాడు.

"అమ్మాయ్ బుల్లెమ్మా! నువ్విచ్చిన లిస్ట్ ప్రకారం అంతా తెచ్చి విడిస్తిని. ఆయిల్‌కి రెండు టిఫిన్లు కొంటిని. చూడమ్మా! మీ పిన్ని ఈ సామాన్లు తెమ్మని ప్రాణం తీసి విడుస్తోంది. మళ్ళీ అంతదూరం వెళ్ళమాళక యిప్పుడే తెచ్చి విడిస్తి. రేపు మా పెద్దవాడు మనీ పంపగానే యిచ్చేస్తా. ఏం అనుకోకేం" అంటూ తమ పదిహేను రూపాయల బిల్లూ అందించేడు.

"ఫర్వాలేదులే బాబాయ్. ఏదోయిరుగూ, పొరుగూ అన్నాక ఆ మాత్రం...."

"అందరికీ నీ మాదిరి దొడ్డగుణం వుండద్దా? అమ్మా!" అంటూ దొడ్లో కెళ్ళేరు.

"మామీ! మామీ! అమ్మ మిమ్మల్ని అప్పడాలు వత్తేందుకు రమ్మంది" అంటూ ఓ పదేళ్ళపిల్ల వచ్చింది.

"వస్తున్నా పదతల్లి" అంది.


ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

మా చికిత్సవల్ల తెల్లమచ్చలు గల వారికి పూర్తిగా నయం అవడం ద్వారా మా వైద్యం మంచి కీర్తిని పొందింది. ప్రచారం నిమిత్తం ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా ఇవ్వబడును. మొదటి కోర్సుతోనే మచ్చల రంగు మారడం ఆరంభమవుతుంది. జబ్బు వివరాలు వ్రాయండి.

GAUTAM CHIKITSALAYA
(S-DD)
P. O. KATRI SARAI (GAYA)


"ఇదమ్మా మీ పిన్ని వరస. పేరుకి మేం యిద్దరమే అయినా [illegible]లకి హెల్ప్ చేయడానికే దానికి సరిపోతుంది. తీరికే వుండదు" అన్నాడు సఖ్యం ఓ పట్టు పట్టి.

పిన్నిగారితో బుల్లెమ్మా వెళ్ళింది.

"చూడు రాజీ! మీ బాబాయ్ బజారు అప్పడాలు తినరు. వత్తుదా మనుకుంటే మినప్పప్పు నిండుకుంది. పెద్దాడు యింకా డబ్బు పంపలేదు. మీ బాబాయా అప్పడం లేందే ముద్దెత్తరు" అంది.

"దానికా అంత యిదవుతున్నారు. ఈ పప్పు తీసుకువెళ్ళండి" అంటూ ఓ శేరు గిన్నెడు చాయపప్పు సంచీలోపోసిచ్చింది.

ముచ్చటగా సామాన్లు సర్ది బావకి చూపించింది కుర్చీమీద కూర్చుని కాళ్ళు టకటక లాడించుకుంటూ.

"సామాన్లు సర్దడానికేం దివ్యంగావుంది కానీ 'నీచేతి మాత్ర వైకుంఠయాత్రా' అని నీ వంట మా వంటికి పడుతుందా అని చిన్న సందేహం" అన్నాడు.

"ఏమిటి బుచ్చిబావా! యిప్పుడన్న మాట యింకెప్పుడూ అనక-బారా! నన్నా ఆ మాట అన్నావ్. నావంటకిటు అత్తయ్య దగ్గరా అటు అమ్మ దగ్గరా ప్రశంసా పత్రాలు బడిశాను తెల్సా:" అంది మొగాళ్లా మీసాలు మెలిపెడుతూ.

"తల్లీ! నీ ఫోజే చెప్తోంది నీ వంట గురించి. యిప్పుడనుకుని ప్రయోజనం ఏమిట్లే" అన్నాడు.

"అవును పాపం నువ్వు మనింట్లో వంట లక్క శేషమ్మగార్ని చేసుకుండాల్సింది. సిగ్గు లేకపోతేసరి." అంటూ దొడ్లోకెళ్ళిందల్లా-

"ఏమండోయ్!" అంటూ గావు కేక పెట్టింది.

"ఏమిటా గావుకేకలు నువ్వూ - యిది మద్రాసు-మన తాడికొండ కాదు" అంటూ వచ్చేడు.

"చిత్తం! దుప్పటే. ఓ చెంబు నీళ్ళు యిట్లా పెట్టండి" అంది.

"అయిందీ! అకటా ఓ క్రూర విధీ రోకటిలో తలదూర్చి రోకటిపోటునకు వెరువనేలా? ఓ బాలా! కూరేం చెయ్యమంటావో శెలవియ్యి" పంగి సలాంపెడ్తూ అన్నాడు.

"అమ్మాయ్ మీ బాబాయ్‌కి పెరుగు లేందే ముద్ద దిగదు. ఓ గరిటెడు పెరుగివ్వు తల్లీ! రాత్రి సరిగ్గా తోడుకోలా పాలు" అంటూ వచ్చి బుల్లెమ్మని చూసి.

"ఇంతకీ వంట చేసే కూచున్నావా?" అంది.

"లేదు పిన్నీ ఈ మూడు రోజులూ మా శ్రీవారి పాకమే ప్రాప్తం" అంది నవ్వుతూ.

"గొప్పే లే. నే వుండగా చూస్తూ అబ్బాయి నొండనిస్తానా? ఎవరన్నా వింటే నవ్వి పోతారు" అంది.

"తప్పుతుందా మరీ!"

"మా యింట్లో వున్నంతవరకూ. నువ్వా దిగులేం పెటుకోమాక. మాతో పాటే మీకిద్దరికీ వుడకెయ్యడమే కష్టమా? మాట్లాడుతూ కూచుంటే అబ్బాయి కవతల ఆఫీసుకి టయం అవుతోంది" అంటూ కదలబోయింది.

"పిన్నిగారూ ఒక్క షరతుమీదైతే వండండి ఈ మూడు రోజులూ మీరిద్దరూ మా యింట్లో భోంచేసేట్టయితేనే వండండి.

"ఏమిటో నీది మరీ చాదస్తం చెప్తే వినవు. కానియ్ మరేం చేస్తాం." అంటూ ఆ మూడు రోజులు మీ బాబాయి కదిష్టం, యిదిష్టం అంటూ తమకొవల్సినవి వండుకుతిని. వాళ్ళకీ యింత పెట్టేరు. దానికే మహా మురిసిపోయింది బుల్లెమ్మ.

ఆ మర్నాటి నుంచీ తనకి సింగడి చుక్కల చీరమీద మనసు పోయిందనీ ఏ నెలకా నెలే డబ్బు లేక తన ఆశ తీరనే లేదని వాపోవడం ఆరంభించింది. ఏదో అండగా వుంటున్నారుగదా అని తనే పేద ముత్తైదనీ కొనిచ్చింది.

"బాహోయ్! పిన్నిగారి తల్లి పాలఘాట్ బ్రాహ్మలట. వెయ్యి రూపాయలకి కొనుక్కొచ్చుకున్నారట. ఆమె తమ్ముడే ఈ బాబాయిగారట. కాబట్టి తమ్ముణ్ణి దగ్గరుంచుకుని నాలుగు పౌరోహితం ముక్కలు నేర్పించి పిల్లనిచ్చి చేశారట. మద్రాసులో తెలుగు వారింట్లో ఈయనకి కొన్ని వాడికలు కుదిరైట - పూజలూ, పునస్కారాలు వ్రతాలు చేయించడంలో దిట్టలు. దాంతో తెలుగువారిళ్ళలో చాలా వాడికలు కుదిరైట. ఆ డబ్బుతో యీ యిల్లూ అదీ కట్టి, యిద్దరి కొడుకులనీ బిఏ. దాకా చదివించి, వాళ్ళనీ వీళ్ళనీ ప్రాధేయపడి మంచి వుద్యోగాల్లో వేయించాట్ట. కూతుర్ని వుద్యోగస్థుడికే యిచ్చాడట.

"బారా ఎట్టెట్టా - అదదీ - అందుకే అయ్యగారి తెలుగు అంత అర్ధాన్నంగా వుందన్నమాట."

"ఆయన తెలుగెట్లావున్నా. సమయస్ఫూర్తిగా యింగ్లీష్ పదాలు వుపయోగించడంలోనే వుందాయన బ్యూటీ అంతా." అని నవ్వింది.

"చూడమ్మా! బుల్లీ! నీ దగ్గర ఎవర్ సిల్వర్ సామాన్లు అంతగా వున్నట్టులేవే?"

"అప్పుడు పూర్లో అత్తయ్య దగర వున్నయ్యండీ!"

"వున్నా అవి పాతవేగా కొత్త మోస్తరైనోన్ని వస్తున్నై. ఎంత డబ్బొచ్చినా ఖర్చయిపోతూనే వుంటుంది ఇంటికి ఓ వస్తువంటూ ఏర్పరుచుకోడం ఎంతో ముఖ్యం. ఓ మూడు చీట్లు కడు. ఎంతో లేదు మూడైదులంతే. అదృష్టముంటే రెండోనెలే నీ పేర చీటీ పడొచ్చు ఎవరు చూడొచ్చారు" అంటూ మూడు చీట్లు కట్టించింది.

కొత్త చీట్లు కట్టించినప్పుడల్లా చీటీకి ఆయిదేసి రూపాయల కమీషనుండామెకా కొట్లో. కమీషన్‌తోపాటు యింకో పదేసు కుంటే చక్కటి చెంబొస్తుం దనుకుని "బుల్లెమ్మాకు చేతికిందకి చెంబులేక మహా అవస్థపడుతున్నా సుమా. ఓ పది రూపాయలు సర్దేవంటే మా చిన్నాడు డబ్బు పంపగానే యిచ్చేసా" నంటూ పది రూపాయలు స్వాహా చేసింది.

"ఏమిటో పెద్ద దాన్నయ్యా- ఓపిక చచ్చినా జంజాటం తప్పలా. ఆ చెట్లకి నోరావాయా ఓ చెంబెడు నీళ్ళు పోస్తే పుణ్యం తల్లీ" అని తియ్యటి మాటలు చెప్పి రెక్కలు పడేలా నీళ్ళు పోయించి తీరా చెట్లు పూలు పూసేనాటికి యిరుగూ, పొరుగూ బుట్టలు తీసుకు తయారయ్యారు. డబ్బులకి పూలమ్ముతుందని తెలీని బుల్లెమ్మ ఆమె దానధర్మాలకి మురిసిపోతూ, తన చేత్తోనే పన్నేరం చేసేది.

"అబ్బాయ్ రోజూ ఆఫీసుకే వెళ్తాడా. కూరల సంచులు పట్టుకుని తిరుగుతాడా. మేంమాత్రం ఎన్ని కూరలని తినగలం" అంటూ మొగుడికి మోయనకిచ్చిన చచ్చుపుచ్చు కూరలు అంటగట్టేది

మధ్యాహ్నం కాఫీవేళకి ఏదో వంకని తయారయేది


ఆర్నెల్లు తిరిగేసరికి తమ వూరగాయల జాడీలు ఖాళీలై కడిగి ఎండన పెట్టింది. దానా దీనా బుచ్చిబాబూ. బుల్లెమ్మలకి యింటివారి వుదార గుణంలోని ఆంతర్యం అర్థమై తల పంకించుకున్నారు.

అద్దె పేరుకి యాభైయ్యే రూపాయలైనా కంటికి కనపడకుండా నెలకి హీనపక్షం ఓ వందన్నా ఎగిరిపోతున్నట్టు తెల్సుకుని గుడ్లు తేలేసేరు.

ప్రతి నెలా మూడురోజులు తమ సంబారాలతోనే వండి వాళ్ళు తింటూ తమ కింత పెడ్తూ దానికి వడ్డీగా చీరనీ, అదనీ, యిదని ఓ ముప్ఫైయ్యో నలభయ్యో తమ చేతి చమురు వదిలించే వారినై పుణ్యానికి ఆశ్చర్యపోతూ.

"ప్రబతక నేర్చినవాడే బుల్లీ!" అన్నాడు.

"కాబట్టే పౌరోహితుడి పెళ్ళామైనా రవ్వల దుద్దులూ. రవ్వల ముక్కుపుడకలతో మెరిసిపోతోంది." అంది. "పోన్లే మనం యిప్పటికన్నా కళ్ళు తెరిచాం. మా దేంకుకి దగ్గర్లో. సెంటర్లో ఓ యిల్లు వుంది అద్దె రెండొందలు అయినా ఫర్వాలే. వెళ్ళిజేర్దాం. యడ్వాన్సుకూడా యిచ్చేశా బుల్లీ!"



KSL-96-Tel